
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

● నోడల్ అధికారుల పాత్ర కీలకం ● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 15: సార్వత్రిక ఎన్నికలకు సజావుగా నిర్వహించడంలో నోడల్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు, ఎన్నికల సమయంలో చేపట్టాల్సిన వివిధ కార్యకలాపాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించారు. త్వరలో వచ్చే సాధారణ ఎన్నికలను ఎలాంటి అవాంతరాలు లేకుండా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి ఆయా అంశాల్లో నోడల్ అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నియమాలు, విధానాలతో ఇప్పటి నుంచే తమను తాము సన్నద్ధం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి బుక్‌లెట్‌లను ఈసీఐ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎటువంటి ఇబ్బంది లేకుండా నిష్పక్షపాతంగా చేయడానికి నియోజకవర్గ ఈఆర్‌వోలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని కోరారు. నోడల్ అధికారులందరినీ జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షిస్తారని, ఎన్నికల సంబంధిత కార్యకలాపాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించడం, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే చాలా తీవ్రంగా పరిగణిస్తామని, అమలులో ఉన్న ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత షెడ్యూల్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఆర్‌వో సత్యనారాయణరావు, నియోజకవర్గ ఈఆర్‌వోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణ బాధ్యతగా చేపట్టాలి

● మాసాపేట హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో
● విద్యార్థులు అల్లరి చేస్తుండటంతో ఉపాధ్యాయులపై డీఈవో ఆగ్రహం


రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: పాఠశాల నిర్వహణను బాధ్యతగా చేపట్టాలని, తరగతి గదిలో పదో తరగతి విద్యార్థులు అల్లరి చేస్తుండటంతో ప్రధానోపాధ్యాయుడితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ పరిధిలోని మాసాపేట హైస్కూల్‌ను డీఈవో శివప్రకాశ్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాల తనిఖీకి వెళ్లిన ఆయన నేరుగా తరగతి గదులు కలియ తిరిగారు. ఈ సమయంలో తరగతి గదిలో విద్యార్థులు అల్లరి చేస్తుండటంతో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులపై డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల, తరగతి గది నిర్వహణ అతి సున్నితమైన అంశం దానిని ఎవరూ అలక్ష్యం చేయకూడదని బాధ్యతగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం పదో తరగతిలో టాపర్స్ వివరాలు తెలుసుకుని వారితో సెల్ఫీ తీసుకున్నారు. సుమారు గంట పాటు పాఠశాలలో తనిఖీ నిర్వహించిన అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి అందరి బాధ్యతలను గుర్తు చేశారు. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు టోఫెల్ తరగుల నిర్వహణ తప్పనిసరిగా ఏప్రిల్ 12న నిర్వహించబోయే టోఫెల్ రెడినెస్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ప్రతిరోజూ దానిపైన తరగతులు నిర్వహించాలన్నారు. ఎస్‌సీఈఆర్టీ వారు రూపొందించిన దృశ్య శ్రవణ కంటెంట్‌ను దీనికోసం తప్పక ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల బైజూస్ ల్యాబ్‌ల వినియోగం మీద, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ల నిర్వహణ, అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

క్రీడా శిక్షణా కేంద్రం సమాధిపై.. సినీ స్టూడియో

● హార్సిలీహిల్స్‌లో మినీ స్టూడియోతో ఎవరికి లాభం.?
● సొంత పత్రికతో ఎదురు దాడి
● రాయలసీమలో వంద ఎకరాల్లో స్టూడియో కట్టినా అభ్యంతరం ఎవరికి?



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రజల అభిప్రాయంతో మాకు సంబంధం లేదు.. మేము ఏమనుకుంటే.. అది జరిగి తీరాల్సిందే.. అన్న చందంగా రాష్ట్రంలో పాలన జరుగుతున్న నేపథ్యంలో.. హార్సిలీహిల్స్‌లో శాప్ శాఖకు చెందిన ప్రతిపాదిత, నిర్మాణంలో ఉన్న క్రీడా శిక్షణా కేంద్రంలో వేలాదిమంది క్రీడాకారుల భవిష్యత్తుపై సమాధి కట్టి.. దానిపైనే.. తనకు కావాల్సిన దర్శకుడి రంగుల కలలను నేరవేర్చేందుకు.. జగనన్న సినీ స్టూడియో నిర్మిస్తున్నాడు. క్రీడా శిక్షణా కేంద్రం ఈ ఐదు సంవత్సరాల కాలంలో పూర్తయి ఉంటే వందల మంది క్రీడాకారుల భవిష్యత్తు మరోలా ఉండేది. అయితే ఐదు సంవత్సరాలలో క్రీడా కేంద్రం అభివృద్ధికి పైసా నిధులు ఇవ్వకపోగా ఇప్పుడు ఏకంగా యాత్ర సినిమా తీసిన డైరెక్టర్ మహేంద్రరెడ్డి కోరినట్టుగా ఆ స్థలంలో మినీ స్టూడియో, అమ్యూజ్‌మెంటు సెంటర్ ఏర్పాటు కోసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగింది. తాను మినీ స్టూడియో కోసం కేవలం రెండు ఎకరాలు మాత్రమే అడుగుతున్నా, వందల ఎకరాలు కాదని, ఇక్కడ మినీ స్టూడియో నిర్మిస్తే రాయలసీమలో సినీరంగం అభివృద్ధి చెందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని డైరెక్టర్ మహేంద్ర రెడ్డి చెబుతున్నారు. అదే సమయంలో తమ సొంత పత్రికతో పాటు వైసీపీ అనుకూల మీడియా, యూట్యూబ్ ఛానళ్లు సైతం హార్సిలీహిల్స్‌లో రెండు ఎకరాలు కేటాయిస్తే తప్పేంటి.. సినిమా పరిశ్రమ రాయలసీమలో అభివృద్ధి చెందడం ఇష్టం లేదా? అంటూ ప్రభుత్వ నిర్ణయానికి బాకా ఊదుతోంది. దేశంలోనే ప్రత్యేక ప్రదేశమైన హార్సిలీహిల్స్‌లో కాకుండా రాయలసీమలోనే మరెక్కడైనా వందల ఎకరాల్లో స్టూడియో నిర్మించి.. సినీరంగాన్ని అభివృద్ధి చేస్తే ఎవరూ అడ్డుచెప్పరని, ఆంధ్రజ్యోతితో సహా పలువురు పేర్కొంటున్నారు.

ఆంధ్ర ఊటీ హార్సిలీహిల్స్ ఎన్నో ప్రత్యేకతలకు నిలయం. ఇక్కడ సుమారు 150 సంవత్సరాల నాటి యూకలిప్టస్ చెట్లు ఉన్నాయి. ఇదే కొండలపైన అనేక అడవి జంతువులు ఉంటాయి. సముద్రమట్టానికి ఎంతో ఎత్తులో ఉండడంతో.. ఎప్పుడూ చల్లగా ఉంటుంది. ప్రత్యేకించి ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇక్కడి వాతావరణం ఎంతో అహ్లాదకరంగా ఉంటుంది. ఈ ప్రత్యేకతలను గుర్తించిన బ్రిటీష్ పాలకులు దీనిని వేసవి విడిదిగా ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు సైతం వేసవిలో పర్యాటకుల తాకిడి చాలా ఎక్కువగా ఉంటుంది.

క్రీడాకారులకు ఎంతో ఉపయోగం

సముద్ర మట్టానికి 4 వేల పైచిలుకు అడుగుల ఎత్తులో ఉండడంతో ఇక్కడ ఆక్సిజన్ చాలా స్వచ్ఛంగా ఉంటుంది. దీనిని గుర్తించి 2018లో అప్పటి ప్రభుత్వం కోటావూరు గ్రామ పరిధిలో సర్వే నెంబరు 571/1లో 3.74 ఎకరాలు రెవెన్యూ శాఖ నుంచి శాప్‌కు కేటాయించింది. ఈ శాఖ ఇక్కడ క్రీడా శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి నడుం బిగించింది. శిక్షణా కేంద్రం పూర్తి కావడానికి రూ.3.50 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. రూ.1.60 కోట్లతో ఈ స్థలం చుట్టూ ప్రహరీగోడను నిర్మించింది. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం క్రీడా శిక్షణా కేంద్రం గురించి అసలు పట్టించుకోలేదు. ఐదు సంవత్సరాలలో కనీసం ఒక రూపాయి కూడా క్రీడా శిక్షణా సంస్థ అభివృద్ధి కోసం కేటాయించలేదు. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కీర్తిస్తూ దర్శకుడు మహేంద్రరెడ్డి నిర్మాతగానూ మారి యాత్ర-2 సినిమా తీశారు. ఈ నేపథ్యంలో హార్సిలీహిల్స్‌పైన దర్శకుడికి క్రీడాశిక్షణా కేంద్రానికి కేటాయించిన స్థలంలో రెండు ఎకరాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడింది. ఇప్పటికే ఈ మేరకు స్థానిక అధికారుల నుంచి ఫైల్ సిద్ధం అయి కలెక్టర్ టేబుల్‌పైకి చేరింది. అయితే ఈ కేటాయింపులపై ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండానే మొండిగా ముందుకు వెళ్తోంది.

మూకుమ్మడిగా ఎదురుదాడి

అయితే ఈ కేటాయింపులు సరైనవి కావు.. హార్సిలీహిల్స్‌పైన ప్రైవేటు వ్యక్తులకు భూములు కేటాయించవద్దని మాట్లాడుతున్న మీడియా, ప్రతిపక్షాలపై అధికార పార్టీ కనుసన్నల్లో పని చేసే మీడియా, జగన్ సొంత మీడియా, యూట్యూబ్ ఛానళ్లు మూకుమ్మడిగా ఎదురు దాడిని మొదలుపెట్టాయి. హార్సిలీహిల్స్‌లో మినీ స్టూడియో ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉపాధి, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఈ మినీ స్టూడియో వల్ల హార్సిలీ హిల్స్‌లో పెద్ద చిత్రాల షూటింగులు జరుగుతాయని, హార్సిలీహిల్స్‌కు మహర్దశ పట్టినట్టేనని ఊదరగొడుతున్నాయి. 1966లో కృష్ణ నటించిన సినిమా ఇక్కడ తొలుత షూటింగ్ జరుపుకుంది. ఆ తర్వాత అనేక కన్నడ, తమిళ, తెలుగు చిత్రాలు ఇక్కడే నిర్మాణం జరుపుకున్నాయి. సాధారణంగా ఏ సినిమాకైనా కథానుసారమే లోకేషన్లు ఎంచుకుని షూటింగ్ జరుపుతారు. మినీ స్టూడియో ఇక్కడి నిర్మాణం జరిగితే.. ఏ విధంగా రాయలసీమలో చిత్ర పరిశ్రమ పెరిగి పెద్దదవుతుందో? రెండు ఎకరాల కేటాయింపు సరైందనే అంటున్న వాళ్ల చెప్పాలి. ఎక్కడైనా పెద్ద సినిమా షూటింగ్ ప్లాన్ చేసుకుంటే చిత్ర నిర్మాణానికి సంబంధించిన అన్ని విభాగాలు వాళ్లకు అందుబాటులో ఉంటాయి. (ఈ మేరకు ఒప్పందాలు చేసుకుంటారు.) కేవలం అవుట్‌డోర్‌ల లో షూటింగ్ పూర్తి చేసుకుని.. మిక్సింగ్, ఎడిటింగ్, రికార్డింగ్, రీరికార్డింగ్ వంటి కార్యక్రమాలను అన్ని సౌకర్యాలు ఉన్న ప్రముఖ స్టూడియోలలో ఖర్చుకు వెనకాడకుండా చేసుకుంటారు. ప్రీప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు షూటింగ్ జరిగే లొకేషన్‌తో సంబంధం లేకుండా ఉంటాయి. అయితే విచిత్రంగా హార్సిలీహిల్స్‌పైన మినీస్టూడియో ఏర్పాటు చేస్తే మొత్తం చిత్ర పరిశ్రమే ఇక్కడికి తరలి వచ్చేస్తుందనే స్థాయిలో కొందరు హంగామా చేస్తున్నారు. రెండు ఎకరాలలో మినీ స్టూడియో కడితే స్థానిక యువతకు ఉపాధి సదుపాయాలు, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతుతాయని అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. నిజంగా దర్శకుడికి రాయలసీమ ప్రాంతంలో సినిమా పరిశ్రమ అభివృద్ధి జరగాలనే ఉంటే ఎలాగూ ముఖ్యమంత్రి తాను ఏది అడిగినా.. ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఎక్కడైనా రోడ్డు సౌకర్యం సరిగా ఉన్న ప్రాంతంలో వంద ఎకరాలలో స్టూడియో నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ఆ స్టూడియోలో చిత్ర నిర్మాణ రంగానికి చెందిన అన్ని విభాగాలను అందుబాటులో ఉంచాలని ఆంధ్రజ్యోతి కూడా కోరుతోంది. అయితే ఇవేవి పట్టించుకోకుండా అత్యంత విలువైన హార్సిలీహిల్స్‌లో భూమిని కాజేసేందుకే మినీ స్టూడియో, అమ్యూజ్‌మెంటు సెంటర్ డ్రామాలు ఆడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అమ్యూజ్‌మెంట్ సెంటర్ అంటే.. ఏంటో..? అక్కడ ఏమి ఏర్పాటు చేస్తారో? దానివల్ల రాయలసీమలో సినిమారంగానికి కలిగే ప్రయోజనం ఏంటో? చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కనులపండువగా కల్యాణం

● గోవింద నామంతో పులకించిన దేవుని కడప



కల్యాణం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 15. దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవిలతో శ్రీనివాసుడి కల్యాణం కన్నులపండువగా సాగింది. పుష్పాలతో లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణవేదిక వైకుంఠాన్ని తలపించేలా తీర్చిదిద్దారు. వేదికకు ఓ వైపున వేద పండితుల మంత్రోచ్చారణలు, మరోవైపు అన్నమయ్య సంకీర్తనలు, మంగళవాయిద్యాలు, గానామృతం, సుస్వర నాదాల నడుమ కల్యాణం ఆద్యంతం కమనీయంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో చేపట్టిన తిరుమలేసుడి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తజనం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్ సాయి, తరుణ్, రఘునందన్, కృష్ణమూర్తి తదితరులు శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి గజవాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. కాగా.. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథసప్తమి వేడుకలు జరుగనున్నాయి.

అత్యాశే ముంచిందా..?

● ఎస్‌డీఐసీ సంస్థ పేరుతో లూటీ
● రెడ్‌రాక్ ఊబిలోకి వందల సంఖ్యలో బాధితులు
● ప్లేటు ఫిరాయించడంతో స్పందనలో ఓ మహిళ ఫిర్యాదు
● సుండుపల్లెలో సుమారు రూ.3 కోట్లకుపైగా డిపాజిట్లు



సుండుపల్లె, ఫిబ్రవరి 15: అధిక వడ్డీ ఆశ చూపి రాత్రికి రాత్రే రెడ్‌రాక్ అనే సంస్థ ప్లేటు ఫిరాయించడంతో దాదాపు రూ.3 కోట్లకు పైగా బాధితులు నష్టపోయారు. ఈ సంఘటన సుండుపల్లెలో వెలుగులోకి వచ్చింది. అతి తక్కువ కాలంలో అధిక డబ్బు సంపాదించి కోటీశ్వరులు కావాలనే అత్యాశ వందల మంది కొంప ముంచినట్లు తెలుస్తోంది. రెడ్‌రాక్ పవర్ లిమిటెడ్ సంస్థలో అధిక వడ్డీ ఇస్తున్నారు అని ఒక ప్రచారం జోరందుకోవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు డబ్బుకు ఆశపడి కోట్లాది రూపాయలు డిపాజిట్ చేయడంతో ఆ సంస్థ ఈనెల 11వ తేదీ బోర్డు ఫిరాయించినట్లు తెలుస్తోంది. ఈనెల 10వ తేదీ రెడ్ రాక్ సంస్థ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ ఇచ్చిన ఆఫర్‌ను ఆన్‌లైన్‌లో చూసి డిపాజిట్లు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. కేవలం కొంతమందికి మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, ఫిబ్రవరి 10వ తేదీ శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఎంత డిపాజిట్ చేస్తే దానికి రెండు రెట్లు అధిక మొత్తం ఆరు రోజుల పాటు ఇస్తామని ఆశ చూపినట్లు బాధితులు చెబుతున్నారు. అది కూడా ఒక మనిషి రూ.41 వేలు మాత్రమే డిపాజిట్ చేసే అవకాశం ఉంటుందన్న ఆఫర్‌ను ఆన్‌లైన్‌లో చూసిన ప్రజలు పెద్ద సంఖ్యలో తమతో పాటు ఇతరులకు డబ్బులు ఇచ్చి జమ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం అంతా గత కొన్ని రోజుల నుంచి నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్కాంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, నిరుద్యోగులు, వ్యాపారస్తులు, యువకులు, మహిళలు, రాజకీయ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. సుండుపల్లె మండలానికి చెందిన ఓ వ్యక్తి ఈ సంస్థను వెలుగులోకి తీసుకురావడంతో డబ్బులు జమ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారమంతా ఒక గొలుసు రూపంలో ఒకరి నుంచి ఒకరికి సమాచారం అందించడం వలన జరిగినట్లు తెలుస్తోంది. ఈ స్కాం ఎట్టకేలకు ఓ మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. ఈ స్కాంలో కొంతమంది వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సైతం భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ యాప్‌లో కొంతమంది 5 లక్షలకుపైగా కూడా డిపాజిట్లు చేసినట్లు సమాచారం. సుండుపల్లె మండలానికి చెందిన సుమారు 425 మంది ఆ సంస్థ క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూపులో ఉన్నారు. వీరే కాకుండా మరి ఎంత మంది వేరే గ్రూపుల్లో భాగస్వాములు అయ్యారో తెలియాల్సి ఉంది. సుండుపల్లె మండలంలోనే దాదాపు రూ.3 కోట్లకుపైగా డిపాజిట్లు చేసినట్లు సమాచారం. ఒకసారి ఆ సంస్థలో భాగస్వాములు కావాలంటే రూ.20 వేలు డిపాజిట్ చేయాలనే నిబంధన కూడా ఈ రెడ్ రాక్ సంస్థ పెట్టినట్లు బాధితులు చెబుతున్నారు.

ఫిర్యాదు చేశారు విచారణ జరుగుతోంది..

స్పందనలో ఫిర్యాదు చేశారు. స్పందన నుంచి స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. పై అధికారులు విచారిస్తున్నారు. ఎవరు ఏమి అనే విషయాలపై త్వరలో వెల్లడిస్తాము. ఈ సంస్థలో భాగస్వాములు అయి నష్టపోయిన వారు ఉంటే స్టేషన్‌లో సమాచారం ఇవ్వవచ్చు.

- హుస్సేన్, ఎస్ఐ, సుండుపల్లె

ప్రైవేటు యాప్‌లను నమ్మి మోసపోవద్దు : సీఐ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రెడ్ రాక్ ప్రైవేట్ లిమిటెడ్ యాప్‌ను నమ్మి రూ.15 లక్షలకు పైగా పోగొట్టుకున్న సుండుపల్లె, శిబ్యాల, రాయచోటి, కదిరి తదితర ప్రాంతాలకు చెందిన 17 మంది బాధితులు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు రూరల్ సీఐ తులసీరామ్ బాధితులను పిలిచి విచారించడంతో పాటు బాధ్యులంటూ చెబుతున్న సైమన్స్ బాబాలను కూడా విచారించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఎక్కడా కూడా నేరుగా ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకోవడం కానీ, ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకోవడం కానీ, రసీదులు ఇచ్చినట్లు ఎక్కడా ఆధారాలు లేవన్నారు. అందరూ కూడా వారి ఫోన్‌లో రెడ్ రాక్ ప్రైవేటు లిమిటెడ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి ఆ యాప్ ద్వారా డబ్బులు వేసి నష్టపోయారన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా లక్షల్లో యాప్ ద్వారా నష్టపోయినట్లు చెబుతున్నారని సమస్యను సైబర్ క్రైమ్ పోలీసులకు రెఫర్ చేసినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారిస్తున్నామని రూరల్ సీఐ తెలిపారు.

అసలేమి జరుగుతోంది..?

● బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిటీ విచారణ ● 17 మంది నియామకంపై ఆరోపణలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 15: మదనపల్లెలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏమి జరుగుతోంది. ఏకంగా 17 మంది బోధన, బోధనేతర సిబ్బందిని అక్రమ మార్గంలో నియమించారని వచ్చిన ఫిర్యాదులపై గురువారం ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి ఆధ్వర్యంలో ఓ కమిటీ విచారణ మొదలుపెట్టింది. బీటీ కళాశాల ఎయిడెడ్ కళాశాలగా ఉన్నపుడు అక్కడ పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిలో కొంతమంది మినహా పలువురిని అప్పటి యజమాన్యం తప్పుడు సర్టిఫికెట్లు పెట్టడమే కాక, 2018 నుంచి బీటీ కళాశాలలో పనిచేస్తునట్లు సర్వీసు సర్టిఫికెట్ ఇచ్చి అక్రమ నియామకాలు చేపట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. గత ఏడాది బీటీ కళాశాలను ప్రభుత్వపరం చేయడంతో 11.89 ఎకరాల ఆస్తులతో పాటు ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ జీవో నెంబరు 29 విడుదల చేశారు. ఇక్కడే అసలు తతంగం అంతా జరిగిందని గుసగుసలు వినిపించాయి. బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేయడంతో ఇక్కడ పనిచేస్తున్న వారితో పాటు కొందరి పేర్లు చేర్చి వారిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్మనెంట్ చేసేందుకు కొందరు చక్రం తిప్పారు. ఈ క్రమంలో బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్, ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు ఉత్తన్నలు బీటీ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది అక్రమ నియామకాలపై ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఓ కమిటీని వేసి విచారించి నివేదికలు పంపాలని ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో విచారణ కమిటీలోని ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అధ్యాపకులు రాఘవరెడ్డి, శ్రీనివాసులు, శ్రీదేవి, శైలజ విచారణ చేపట్టారు. మొత్తం 17 మంది బోధన, బోధనేతర సిబ్బంది మీద వచ్చిన ఆరోపణలపై విచారణ మొదలు పెట్టారు. వీరిలో చాలామంది అపాయింట్‌మెంట్ ఆర్డర్ లేకుండానే విధుల్లో చేరినట్లు, రెండేళ్ల పాటు వరుసగా సర్వీసు లేనట్లు వీరిపై అభియోగాలు వచ్చాయి. దీనిపై మొదటి రోజు 8 మందిని విచారణ కమిటీ విచారించి, వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించింది.

న్యాక్ పరిశీలనలో పలువురి తొలగింపు

బీటీ కళాశాల ఎయిడెడ్ కళాశాలగా ఉన్నపుడు 2021లో న్యాక్ (నేషనల్ అక్రిడేషన్ కమిటీ) పరిశీలన జరిపింది. అప్పట్లో పీహెచ్‌డీ చేయని గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించి, కేవలం పీహెచ్‌డీ ఉన్న వారినే అధ్యాపకులుగా చేర్చుకుని న్యాక్ పరిశీలన చేయించారు. న్యాక్ పరిశీలన ముగిసిన తరువాత యధావిధిగా కొందరు పాత అధ్యాపకులను తిరిగి గెస్ట్ ఫ్యాకల్టీలుగా చేర్చుకున్నారు. వీరిలో చాలామంది పోస్టు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు (ఒరిజినల్స్) చూపకనే ఉద్యోగాల్లో చేరినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా గెస్ట్ లెక్చరర్ పోస్టుల నియామకంలో ముందుగానే నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించి, వీరి చేత డెమో తరగతులు నిర్వహించాలి. ఇంటర్వ్యూ కమిటీ అభ్యర్థుల ప్రతిభ పట్ల సంతృప్తి చెందితేనే వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి, ఉద్యోగాల్లో నియమించుకోవాల్సి ఉంది. కాని న్యాక్ పరిశీలన పూర్తయిన తరువాత ఈ నిబంధనలు ఏవీ పాటించకుండా నేరుగా కొంతమందిని గెస్ట్ ఫ్యాకల్టీలుగా నియమించుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విద్యార్థి సంఘాలు, పూర్వ విద్యార్థులు ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేయడంతో 17 మందిని పిలిచి విచారణ మొదలు పెట్టారు. వీరితో పాటు బోధనేతర సిబ్బందిపై వచ్చిన అభియోగాలను మరో మూడు రోజుల పాటు విచారించనున్నారు.

ఆరుగురి భవితవ్యం ఏమిటి..?

బీటీ కళాశాలలో దశాబ్దాలుగా బోధనేతర విధులు నిర్వహిస్తున్న ఆరుగురి భవితవ్యం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదే కళాశాలలో పనిచేస్తూ కళాశాలను ప్రభుత్వ పరం చేయాలని రెండేళ్ల క్రితం సమ్మెలోకి వెళ్లిన ఆరుగురు బోధనేతర సిబ్బందిపై కక్ష పూరితంగా వారి పేర్లను ప్రభుత్వపరం చేసే సమయంలో ఎక్కించలేదని సమాచారం. దీంతో ఈనెల 6వ తేదీ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆఫ్ కొలీజియేట్ బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రొసీడింగ్స్ వచ్చాయి. ఇందులో కేవలం 13 మందిని నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. కానీ అంతకు ముందు అంటెడర్లుగా పనిచేసిన ఆరుగురి పేర్లు ఈ ప్రొసీడింగ్స్ ఉత్తర్వుల్లో కనపరచలేదు. అలాగే ఈనెల 6వ తేదీ కొలిజియేట్ కమిషనర్ పోలా భాస్కర్ పేరిట వచ్చిన ప్రొసీడింగ్స్‌లో 17 మందికి గెస్ట్ లెక్చరర్లుగా నియమిస్తూ వీరికి గంటల బోధనల ప్రకారం రూ.28 వేలు వేతనం చెల్లిస్తారు. కాగా దశాబ్దాలుగా బీటీ కళాశాలకు సేవలందించిన ఆరుగురు బోధనేతర సిబ్బంది పేర్లు మాత్రం ప్రొసీడింగ్స్‌లో కనబరచలేదు.



బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖద్వారం

నివేదికను ఆర్‌జేడీకి పంపుతాం..

బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న కొంతమంది బోధన, బోధనేతర సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై విచారణ మొదలుపెట్టాము. వారి సర్టిఫికెట్లు, సర్వీసు, తదితర విషయాలతో పాటు వారిపై వచ్చిన అభియోగాలను విచారిస్తాము. పూర్తి నివేదికలను నాలుగు రోజుల్లో హయ్యర్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ ద్వారా కొలిజియేట్ కమిషనర్‌కు పంపుతాం.

- ఆనందరెడ్డి, ప్రిన్సిపాల్, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మదనపల్లె



ఆరోపణలు వచ్చిన వారిని విచారిస్తున్న ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, కమిటీ సభ్యులు

ట్రాక్టరు ఢీకొని బాలుడు మృతి


మృతి చెందిన షేక్ మహ్మద్ మౌజం

కడప (క్రైం), ఫిబ్రవరి 15 : కడప రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కడప మోచంపేటలోని చిలకలబావివీధికి చెందిన షేక్ మహ్మద్ మౌజం (10) అనే బాలుడు రోడ్డుపై వెళుతుండగా యానాది కాలనీకి చెందిన నాగయ్య ట్రాక్టరు నడుపుతూ ఆటోను తప్పించబోయి బాలుడిని ఢీకొన్నాడు. కొన ఊపిరితో ఉన్న ఆ బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి హసన్‌బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నేత శబరిమలలో గుండెపోటుతో మృతి


వెంకటరమణారెడ్డి (ఫైల్)

చెన్నూరు, ఫిబ్రవరి 15 : చెన్నూరుకు చెందిన టీడీపీ నేత నేలటూరి వెంకటరమణారెడ్డి (56) గురువారం శబరిమలలో గుండె పోటుతో మృతి చెందాడు. రెండురోజుల క్రితం తమ బంధువులతో అయ్యప్ప దర్శనానికి వెళ్లిన ఆయన దర్శనానికి వెళ్లేందుకు పంబా నుంచి నడుచుకుంటూ శబరిమలకు వెళ్లి సన్నిధానం దగ్గరలో గుండెపోటుతో ఒక్కమారుగా కుప్పకూలిపోయాడు. వెంటనే బంధువులు ఆయనను అక్కడున్న వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈనెల 7న నేలటూరు వెంకటరమణారెడ్డి తమ బంధువులు, స్నేహితులతో కలిసి దాదాపు 200 కుటుంబాలతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో ఆయన బంధువులు, కుటుంబసభ్యులతో శబరమల వెళ్లాడు. అక్కడ గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి వార్త తెలియగానే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, ఆకుల చలపతి, జి.మల్లిఖార్జునరెడ్డి, షబ్బీర్‌హుసేన్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మాండవ్యనదిలో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని వెలికితీస్తున్న ఫైర్ సిబ్బంది

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు సమీపంలో మాండవ్యనది నీటిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన మహబూబ్‌బాషా గత కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగ్గా లేక తిరుగుతూ ఉండేవాడు. ఇతను ఐదు సంవత్సరాల క్రితం భార్యకు విడాకులు ఇచ్చి తన తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పట్టణంలోని గాలివీడు రోడ్డులోని రింగు రోడ్డు సమీపంలో మాండవ్యనదిలో పడి మృతి చెందగా గురువారం మృతదేహం నీటిపైన తెలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు అర్బన్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

కడప (క్రైం), ఫిబ్రవరి 15: కడప అక్కాయపల్లెలోని తిలక్‌నగర్‌కు చెందిన శీలం మనోజ్‌రెడ్డి (18) ప్రాణాలను పోలీసులు కాపాడారు. ఈనెల 14న ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి శీలం ఓబులమ్మ కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కడప తాలుకా సీఐ రాజు, ఎస్ఐ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో బాలుడి ఆచూకీ కోసం బాలుడి మొబైల్ నెంబరు లోకేషన్ పెట్టారు. అంతా తిరుగుతూ బ్లూకోల్ట్ సిబ్బంది నగరంలోని చెమ్ముమియ్యాపేటలో గల రైల్వే ట్రాక్ వెంబడి సుమారు ఒక కిలోమీటరు వెళ్లగా రైల్వే బ్రిడ్జి కింద తన చేయి కోసుకుని రక్తపు మడుగులో స్పృహ కోల్పోయి ఉన్నాడు. వెంటనే ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తన సిబ్బంది సహాయంతో బాలుడిని రిమ్స్‌కు తరలించి వైద్యం చేయించి అనంతరం తల్లికి అప్పగించారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన శివకోటి


రన్నర్ ట్రోఫీతో శివకోటి

నందలూరు, ఫిబ్రవరి 15 : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామానికి చెందిన శివకోటి జాతీయ స్థాయి వికలాంగ క్రికెట్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ నగరంలో జరిగిన 3వ మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర రాష్ట్ర దివ్యాంగుల జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుతో చివరి వరకు పోరాడి ఓటమి పాలయ్యామని తెలిపారు. ఈ టోర్నమెంటులో వైస్ కెప్టెన్సీతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి బ్యాటింగ్‌లోను, బౌలింగ్‌లోనూ రాణించి 90 పరుగులు చేయడంతో పాటు 9 వికెట్లు తీసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దివ్యాంగ్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వసంతకుమార్ ఫైనల్ ముగిసిన వెంటనే తనను అభినందిస్తూ ప్రశంసాపత్రం ఇచ్చారని తెలిపారు.

డీఎస్సీ ఉర్దూ పోస్టులకు తీరని అన్యాయం

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 15 : డీఎస్సీ 2024లో ఉర్దూ పోస్టులకు తీరని అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్‌రజాక్, జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా తెలిపారు. గురువారం వారు తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డీఎస్సీ నిర్వహిస్తారని అభ్యర్థులు కళ్లు కాయలు కాచేలా వేచి చూశారన్నారు. నాలుగున్నర సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అయితే ఉర్దూ మాధ్యమ పాఠశాలలు, ఉర్దూ మాధ్యమంలో చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉర్దూ ఎస్‌జీటీ పోస్టులు ఉన్నప్పటికీ జిల్లాల వారీగా జీరో పోస్టులు ఒకటి రెండు చూపించారన్నారు. ఇది అన్యాయమని, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఉర్దూ మాధ్యమ అభ్యర్థులకు తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖధికారులు స్పందించి ఎస్‌జీటీ ఉర్దూ మాధ్యమ వాస్తవ ఖాళీలను ప్రకటించి ఉర్దూ మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

కష్టమైన సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ చూపాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15 : పదో తరగతి విద్యార్థులు వారికి కష్టతరంగా ఉన్న సబ్జెక్టులపై ఎక్కువ శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ సూచించారు. గురువారం కడప నగరం జయనగర్‌కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. అలాగే మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్షలకు 30 రోజులే సమయం ఉందని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. కష్టతరంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 15: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండల పరిధిలోని చంద్రమాకులపల్లె వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంగ్లీషు మీడియం, ఇంటర్ ఫస్టియర్ (సీఈసీ,హెచ్‌ఈసీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ శ్రీరామ కోటేశ్వరరావు తెలిపారు. గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. అదేవిధంగా ఇంటర్‌లో ప్రవేశానికి ఈ ఏడాది 10వ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. కళాశాలలో ప్రవేశానికి అన్నమయ్య, కడప జిల్లాలలో నివాసం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 23 వరకు గడవు ఉందని, మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాల పనివేళలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

అధికార పార్టీనా.. మజాకా



- సొంత పనులకు అడ్డాగా కడప మార్కెట్ యార్డు
- ఇక్కడే ఇసుక, కంకర నిల్వలు
- రైతు విశ్రాంతి గదుల్లో బిహార్ కూలీల నివాసం
- మండిపడుతున్న రైతు సంఘాలు, రైతులు

అధికార పార్టీ కావడంతో తమను అడిగేవారెవరూ ఉండరనుకున్నారో ఏమో.. మార్కెట్ యార్డును సొంత పనులకు యథేచ్ఛగా వాడుకుంటున్నారు. రైతులు పండించే పంటల ఉత్పత్తులను కొనుగోలు చేసి నిల్వ చేయాల్సిన చోట పెద్ద ఎత్తున ఇసుక, కంకర నిల్వలున్నాయి. రైతలకోసం ఉన్న విశ్రాంతి గదుల్లో బీహార్ కూలీలు ఉంటున్నారు. కడప మార్కెట్ యార్డు తమ సొంతు ఇల్లు అనేలా అధికార పార్టీ పెద్దలు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.


కడప మార్కెట్ యార్డులో కాంట్రాక్టర్లు నిల్వ ఉంచిన ఇసుక, కంకర

కడప (రూరల్), ఫిబ్రవరి 15: కడప నగరంలోని శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ నుంచి దేవుని కడప వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. సదరు కాంట్రాక్టు పనులను కడప నగరానికి చెందిన ఓ ప్రజాప్రతిధి ముఖ్య అనుచరులు దక్కించుకున్నారు. ఈ మేరకు రోడ్డు పనులకు సంబంధించి కంకర, ఇసుక నిల్వలను పెద్ద ఎత్తున కడప వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ ఉంచారు. దీంతో మార్కెట్ యార్డులోకి రైతులు తమ ఉత్పత్తులు తీసుకుని రావాలన్నా ఇబ్బందికరంగా మారింది. అంతేకాదు.. ఇక్కడి రైతుల విశాంతి భవనాలను సైతం సదరు కాంట్రాక్టర్లు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఇక్కడ బీహార్‌కు చెందిన కాంట్రాక్టర్లను, కూలీలను ఉంచారు. దీంతో రైతు విశ్రాంత భవరోడ్డు పనులు చేస్తున్న బీహార్ కూలీలకు అవి నివాసాలుగా మారాయి.

కడప మార్కెట్ యార్డులో ప్రస్తుతం పసుపు, వేరుశనగ కొనుగోళ్లు సాగుతున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లా నుంచి పసుపు రైతులు ఇక్కడికి వస్తుంటారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెరుశనగ రైతులు తమ పంటను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా పశుపు, వేరుశనగ రైతులు ప్రతిరోజు పదుల సంఖ్యలో మార్కెట్ యార్డుకు వస్తున్నారు. వీరికి సంబంధించిన విశ్రాంతి భవనాలను వైసీపీ పెద్దలు స్వాధీనం చేసుకుని అక్కడ బీహార్‌కు చెందిన కూలీలను ఉంచడంతో రైతులు చెట్ల కింద కాలం వెల్లదీస్తున్నారు. ఈ వ్యవహారంపై మర్చంట్ అసోసియేషన్ నాయకులు, రైతులు మండిపడుతున్నారు.

డిప్యూటీ సీఎంకు చెప్పినా..

డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజద్ బాషా మూడురోజుల క్రితం మార్కెట్ యార్డులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ రోజున మర్చంట్ అసోసియేషన్ నాయకులు, రైతులు మంత్రి వద్దకు వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టారు. రైతుల విశ్రాంతి భవనాలలో బీహార్ కూలీలు నివాసం ఉంటున్నారని దీంతో మార్కెట్‌యార్డుకు వచ్చే రైతులు ఇక్కట్లకు లోనవుతున్నారని వాపోయారు. అయినప్పటికీ దీనిపై ఎలాంటి చర్యలూ లేవు.

విశ్రాంతి భవనాలు అందుబాటులోకి తేవాలి

కడప వ్యవసాయ మార్కెట్ యార్డు రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన యార్డులో రైతులకు విశ్రాంతి భవనాలు అందుబాటులో లేనపోవడం దారుణమని మర్చంట్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి, మహేశ్ పేర్కొన్నారు. వీటిల్లో బయటివారు నివాసాలు ఉంటున్నారని ఇక్కడికి వచ్చే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి అంజద్‌బాషా దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి సదుపాయం లేని కారణంగా రైతులు, హమాలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు లేకపోవడం వలన వర్షపు నీరు బయటికి వెళ్లడానికి వీలులేక యార్డులోనే నెలల తరబడి నిల్వ ఉండటంతో తాము ఆనారోగ్య సమస్యలకు లోనవుతున్నామని పేర్కొన్నారు. యార్డులోని ఒక్కొక్క పసుపు గిడ్డంగికి ఏడాదికి రూ.40వేలకు పైగా పన్నులను మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తున్నారని కానీ మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడం లేదని వాపోయారు. రైతు విశ్రాంతి భవనాలలో ఉన్న బీహార్ కూలీలను వెంటనే ఖాళీ చేయించి రైతులకు అందుబాటులోకి తేవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున అందోళనలను చేపడతామని ఏపీ రైతు సంఘం నేత దస్తగిరి రెడ్డి హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారుల నిర్లక్ష్యంతో తమకు తిప్పలు తప్పడం లేదని రైతులు, హమాలీలు వాపోతున్నారు.

ఖాళీ చేయిస్తాం..

రైతుల విశ్రాంతి భవనంలో బీహార్ కూలీలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే వారిని ఖాళీ చేయించి రైతులకు అందుబాటులోకి తెస్తామని కడప వ్యవసాయ మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ సెక్రటరీ సుజాత పేర్కొన్నారు. ఈ విషయంపై మార్కెట్ యార్డు చైర్మన్‌తో కూడా సంప్రదించామన్నారు.


రైతుల విశ్రాంతి భవనాల్లో నివాసం ఉంటున్న బిహార్ కూలీలు, కాంట్రాక్టర్లు ఆరేసిన దుస్తులు

ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు


సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 15 : ప్రశ్నించడం ద్వారానే సమాజం మార్పు చెందుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు జేవీవీ యాత్రను ఈనెల 5వ తేదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక హజరత్ అయేషా బాలికల స్కూలులో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్‌ను పెంచడానికి గత ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తే ప్రస్తుతం దేశంలో పాలకులు దానిని తుంచివేస్తున్నారని తెపాఆరు. రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కానీ అందుకు భిన్నంగా మతం కేంద్రంగా మతోన్మాదాన్ని పెంచి రాజ్యాంగస్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందన్నారు. జేవీవీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ (హెచ్)లోని శాస్త్రీయ దృక్పథాన్ని పరిరక్షించుకునే క్రమంలో జనవిజ్ఞాన వేదిక ఈ కళాజాత చేపట్టిందన్నారు. జేవీవీ నాయకురాలు అరుణ మాట్లాడుతూ మహిళలు దేశానికి గర్వకారణమన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కావాలని, ఆచారాలు, సంప్రదాయాల పేరుతో మహిళలను అణగదొక్కడం సరికాదన్నారు. ఐక్యోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జేవీవీ నాయకుడు రాజావెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్‌ను ప్రతిఒక్కరూ అనుసరించాలని, జీవితకాలం అంతా దానిని నమ్మాలన్నారు. కార్యక్రమంలో స్కూలు యాజమాన్యం మజహర్ ఆలీఖాన్, అక్బర్‌బాషా, ఖలీముద్దీన్, యాసీన్, సుల్తాన్, జేవీవీ రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు, మురళీధర్, తవ్వా సురేష్, సునీత, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోలంకి శ్రీనివాసులు, జిల్లా నాయకులు ఎంవీ రాజు, సుజన్‌కుమార్, బాల బయన్న, ప్రియాంక, సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ రహదారి భూములు పరిశీలన


భూముల లేఔట్‌ను పరిశీలిస్తున్న జేసీ , ఆర్డీవో

రాజుపాలెం, ఫిబ్రవరి 15 : వేంపల్లె-చాగలమర్రి 440 జాతీయ రహదారి భూసేకరణ భూములను జేసీ గణేష్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. గ్రామాల్లోకి పోయే భూములు, గ్రామం వెలుపల పోయే భూములను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయశ్రీ, డిప్యూటీ తహశీల్దారు సాయినాథరెడ్డి, సర్వేయరు గుణశేఖర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్స్ స్కూల్స్‌ను గుర్తిస్తాం

- కేంద్ర పథకం ప్రోగ్రాం అసోసియేట్ అధికారి సూరిబాబు


అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూరిబాబు

సంబేపల్లె, ఫిబ్రవరి 15: దేశ వ్యాప్తంగా మోడల్ ఫౌండేషన్ స్కూల్స్‌ను గుర్తిస్తున్నట్లు కేంద్ర పథకం ప్రోగ్రాం అసోసియేట్ అధికారి సూరిబాబు గురువారం తెలిపారు. రాయచోటి పరిధిలోని గున్నికుంట్ల సెక్టార్‌లో చౌటపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 40 పాఠశాలలను గుర్తిస్తున్నట్లు తెలియజేశారు.

ప్రాథమిక పాఠశాల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ల ద్వారా ప్రీస్కూల్ పిల్లలకు అదనపు వసతులను కల్పించి మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఏర్పాటు చేసేందుకు గుర్తిస్తున్నట్లు తెలియజేశారు. సంబేపల్లె మండలంలో చౌటపల్లి, రాయచోటి అర్బన్ పరిధిలో మరొకటి గుర్తించినట్లు టీం సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, ఏఏఎంవో షమీరుల్లా, చౌటపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హాజం, అంగన్వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ వర్కర్ జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల డబ్బు స్వాహా

ఆలస్యంగా వెలుగులోకి...


డబ్బులు స్వాహా అయినట్లు తెలుపుతున్న గ్రూపు సభ్యులు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 15 : పొదుపు సంఘాల డబ్బును స్వాహా చేసేందుకు కొందరు సిద్ధపడుతున్నారు. నగర పంచాయతీ పరిధిలోని గిడ్డంగివీధిలో ఉన్న సుమతి గ్రూపునకు చెందిన డ్వాక్రా సంఘం సభ్యుల లీడర్లు పొదుపు డబ్బులు స్వాహా చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం కమలాపురం నగర పంచాయతీ మెప్మా పరిధిలోకి వస్తుంది. అందులో పది మంది సభ్యులు సుమతి గ్రూపు పేరు మీద డ్వాక్రా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం స్థానిక ఏపీజీబీలో రుణాలు తీసుకున్నారు. పొదుపు చేసుకుంటూ ఉన్నారు. బ్యాంకు నుంచి వారు తీసుకున్న ఈ రుణాన్ని ప్రతి నెలా రూ.50 వేలు బ్యాంకులో డ్వాక్రా సంఘం సభ్యులు చెల్లించి రసీదు తీసుకోవాల్సి ఉంటుంది. ఏం జరిగిందో ఏమో కానీ బ్యాంకులో చెల్లించాల్సిన డబ్బులు బయట ఉన్న రిసోర్స్‌పర్సన్‌కు కొంతకాలంగా డబ్బులు చెల్లిస్తూ వస్తున్నారు. అయితే ఆమె ఆ డబ్బులు బ్యాంకులో చెల్లించడం లేదని తెలుసుకున్న డ్వాక్రా సంఘం సభ్యులు ప్రశాంతి, భార్గవి, లక్ష్మీనరసమ్మ గురువారం నగర పంచాయతీ కార్యాలయం చేరుకుని విషయాన్ని తెలిపారు. ప్రతి నెలా మేము రూ.50 వేలు సంఘం లీడరుకు ఇస్తూ వస్తున్నామని ఆమె డబ్బులు బ్యాంకులో చెల్లించకుండా బయట ఉన్న రిసోర్స్ పర్సన్‌కు ఇచ్చానని చెబుతోందన్నారు. గ్రూపు సభ్యులం అందరం బ్యాంకు వద్దకు వెళ్లి రిసోర్స్ పర్సన్‌ను అడగ్గా నేను బ్యాంకు కరస్పాండెంట్‌కు ఇచ్చానని ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని అన్నారు. గ్రూపు తరపున మేం ఇంతవరకు రూ.7 లక్షల వరకు వసూలు చేసి ఇచ్చామన్నారు. మేం ఇచ్చిన డబ్బులు ఎవరు స్వాహా చేశారో అర్థం కావడం లేదని ఈ విషయమై కలెక్టరుకు స్పందనలో అర్జీ ఇచ్చామని, అదేవిధంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వారు తెలిపారు. ఈ విషయంపై మెప్మా ఏపీఎం లావణ్యను వివరణ కోరగా డబ్బులు స్వాహా అయిన విషయం వాస్తవమేనని, డ్వాక్రా సంఘం సభ్యులే నేరుగా బ్యాంకుకు వెళ్లి డబ్బులు చెల్లించి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. మొత్తం ఆరు లక్షలా 75 వేల రూపాయలు బ్యాంకులో చెల్లించలేదని తేలిందన్నారు. లీడర్ రిసోర్స్‌పర్సన్ ఇద్దరూ ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని ఈ విషయాన్ని నగర పంచాయతీ కమిషనరు దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

వలంటీర్లు బాధ్యతగా సేవలందించాలి

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



వలంటీర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: వలంటీర్లు బాధ్యతగా సేవలందించాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రభుత్వం వరుసగా 4వ ఏడాది చేపట్టిన వలంటీర్లకు వందనం కార్యక్రమంపై గుంటూరు జిల్లా ఫిరంగిపురం నుంచి ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను ప్రదానం చేసే కార్యక్రమం సీఎం జగన్ చేపట్టారు. వర్చువల్ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేడు పురస్కారాలు అందుకున్న వలంటీర్లు అందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లాలో వలంటీర్లు మరింత బాధ్యతగా ప్రజలకు సేవలందించాలని చెప్పారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి లక్ష్మీపతి, జడ్పీ డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, గ్రామ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా నిబంధనలను పాటించని పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకు సమీపంలో తాగునీరు, మరుగుదొడ్లు, గాలి, ప్రథమ చికిత్స కిట్టుతో పాటు అత్యవసర సమయంలో వినియోగదారులకు ఫోన్ సౌకర్యం కల్పించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏ పెట్రోల్ బంకులో నిబంధనలు పాటించడం లేదని, ఇలాంటి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పెట్రోల్ బంకుల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు రామాంజులు, నగేశ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

సంబేపల్లె, ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర గురువారం తెలిపారు. 11 జాతీయ, కార్మిక సంఘాలు, 550 రైతు సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కిసాన్ సంయుక్త మోర్చా, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, కౌలుదారుల సంఘం, 16న జాతీయ సమ్మెకు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రతి కార్మికుడు మోడీ విధానాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

పెనగలూరు తహశీల్దారుగా ఇంద్రాణి

పెనగలూరు, ఫిబ్రవరి 15: మండల నూతన తహశీల్దారుగా సి.హెచ్.ఇంద్రాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కర్నూలు కలెక్టరేటులో పనిచేస్తూ ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికలను మండలంలో పకడ్బందీగా జరిపించేందుకు తనవంతు సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అలాగే శాంతిభద్రతలపై కూడా దృష్టిసారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రెమ్యూనరేషన్ చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



డీఈవో శివప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రెమ్యూనరేషన్ చెల్లింపులో నిర్లక్ష్యం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్.జాబీర్‌లు అన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం వారు డీఈఓ శివప్రకాశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి-2023లో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లుగా పనిచేసిన వారికి చెల్లించాల్సిన రెమ్యూనరేషన్, కంటిన్యూజెన్సీతో పాటు ఏప్రిల్ నెలలో 10వ తరగతి పరీక్షల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్, డీఏలు చెల్లింపులో విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇదే విషయంపై అనేక మార్లు డీఈఓ, కలెక్టర్‌ను కూడా కలిసి విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం చేయకపోవడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన, నిరాశ, నిస్పృహలు అలుముకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో మార్చిలో జరగబోయే పరీక్షల విధులను బహిష్కరించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, దావూద్, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేశ్, వీరబల్లి మండల అధ్యక్షుడు నాగార్జున, చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సుండుపల్లె మండల ప్రధాన కార్యదర్శి శశికిరణ్ పాల్గొన్నారు.

వసతులు మెరుగుపర్చండి

● సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పి.డి.మిశ్రా



రన్నింగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పీడీ మిశ్రా

నందలూరు, ఫిబ్రవరి 15: నందలూరు రైల్వే కేంద్రంలోని లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లకు వసతి కల్పించే రన్నింగ్ రూమ్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలని సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పి.డి మిశ్రా సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన స్థానిక రైల్వే కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రన్నింగ్ రూములో కేవలం 35 మంచాలు ఉండటం వల్ల రన్నింగ్ స్టాఫ్‌కు అసౌకర్యంగా ఉందని, మరో 10 బెడ్స్ ఏర్పాటు కోసం గదులు నిర్మించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన, చారిత్రాత్మక, నందలూరు సౌమ్యనాథస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈయన వెంట సీనియర్ డీఈఈ/టీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ డీఈఈ/టీఆర్ఎస్‌వో వీరయ్య, స్టేషన్ మేనేజర్ కమలాకర్, ఎస్ఎస్ఈ/టీఆర్‌డీ వినోద్‌కుమార్, ఎలక్ట్రికల్ సెక్షన్ ఇంజనీర్ విజయకుమార్, సీసీ వేణుగోపాల్, సీఎల్ఐ పెంచలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు రైల్వే అభివృద్ధికి సహకరించండి

నందలూరు రైల్వే అభివృద్ధికి సహకరించాలని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ కోరారు. గురువారం నందలూరు రైల్వే కేంద్రానికి విచ్చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ పీడీ మిశ్రాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు, స్థానిక నాయకులు అక్కి వెంకటరమణ, మట్టి బాబు, శివ, నరసింహులు, తుమ్మాది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ నేతల డిమాండ్

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 15: పశువుల మేత భూములకు పట్టాలు పుట్టించి ఏపీఎండీసీకి కోట్ల రూపాయలు గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు రాజంపేట ఆర్డీవో కార్యాలయం దగ్గర నిరసన తెలిపారు. ఈ మేరకు ఏవో సత్యానందంకు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య హాజరై మాట్లాడుతూ మంగంపేట కాపుపల్లి గ్రామ పంచాయతీ సర్వే నెంబరు 8లో విస్తీర్ణం 72.77 ఎకరాల భూమి పశువుల మేత పరంబోకును గ్రామ అవసరాలకు, శ్మశానవాటిక, పశువుల మేతకు, దేవుడిగుడికి ఉపయోగించుకుండేవారన్నారు. అటువంటి భూమికి దొంగ పట్టాలు సృష్టించి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన భూ కబ్జాదారులను, సహకరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు శివయ్య, మండల కార్యదర్శి తేజ్‌కుమార్, మహిళా సమైక్య మండల కార్యదర్శి రోజమ్మ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 15: ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ మహిళ నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. గురువారం మండలంలోని విద్యానగర్, తూర్పుపల్లి, మాధవరంపోడు తదితర గ్రామాల్లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే సంక్షేమ పథకాలపై గ్రామస్థులకు వివరించారు. టీడీపీ జనసేన రూపొందించిన ఉమ్మడి మేనిఫెస్టో గురించి మహిళలకు, యువతకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిన్న, యువ నాయకులు సిద్ధేశ్వర, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎన్ నాయుడుతో జగన్‌మోహన్‌రాజు భేటీ



జీఎన్ నాయుడుతో చర్చలు జరుపుతున్న చమర్తి

రాజంపేట, ఫిబ్రవరి 15: టీడీపీ రాష్ట్ర సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త డాక్టర్ జి.యన్.నాయుడుతో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం రాజంపేటకు వచ్చిన జి.యన్ నాయుడును ఆయన అతిథి గృహంలో చమర్తి మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎవరికి టికెట్టు వచ్చినా అందరూ కలిసికట్టుగా పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుడారు సుబ్రమణ్యంనాయుడు, పుల్లంపేట మండల మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రమేష్‌నాయుడు, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, రీజెన్సీ నలందా సీఈవో గూడారు చందు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, వీరబల్లి మండల సీనియర్ నాయకులు అమరేశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రౌడీలు, గూండాలదే రాజ్యం : జనసేన



విలేకర్లతో మాట్లాడుతున్న వెంకటరమణ

రాజంపేట, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో రౌడీలు, గూండాలు రాజ్యమేలుతున్నారని జనసేన రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జనసేన నేత పవన్‌కళ్యాణ్ భీమవరం పర్యటనకు వెళ్లడానికి ప్రయత్నిస్తే సెల్‌టవర్ సాకు చూపి పర్యటనను అడ్డుకోవడం హేయమైన చర్య అన్నారు. సీఎం జగన్‌కు, వైసీపీ మంత్రులకు ఏనాడూ సెల్ టవర్లు అడ్డు రాలేదా అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన కూటమికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి వచ్చే ఎన్నికల్లో ఓటమి చెందుతామని భయపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కరపంతులు, శ్రీనివాసులు, న్యాయవాది కత్తి సుబ్బరాయుడు, గోపి చౌడయ్య, వీరయ్య, శిరీష, మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం : అతికారి క్రిష్ణ

సిద్దవటం, ఫిబ్రవరి 15: క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయని రాజంపేట జనసేన నాయకుడు అతికారి కృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సిద్దవటం పీహెచ్‌సీ పక్కన గల మైదానంలో విద్యార్థుల వాలీబాల్ క్రీడలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జనసేన పార్టీ తరపున జిల్లా స్థాయిలో క్రీడలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు బాబీ, క్రీడాకారులు జనసేన పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

సైన్స్‌తో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 15: విద్యార్థులు సైన్స్‌తో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ 12వ తేదిన జిల్లా స్థాయిలో రాయచోటి డైట్ కళాశాలలో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో 10వ తరగతి విద్యార్థులు తరుణ్‌కుమార్ చేసిన ప్రాజెక్టు మంచి ప్రతిభ కనబరిచింది. ఇందుకు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో గురువారం విద్యార్థి తరుణ్‌కుమార్‌కు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పల్ నాగయ్య, ఉపాధ్యాయులు విజయ, రాజ్‌కుమార్, సుధాకర్, నిత్యపూజయ్య, విజయకుమారి, శ్రీకళ, సుజాతమ్మ, జమ్రూద్‌బేగం, శ్రీనివాసులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసులు

రామాపురం, ఫిబ్రవరి 15: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ రామాపురం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న అరవిందకిశోర్ యథాస్థానంలో కొనసాగుతున్నారు.

'ఫ్లెక్సీలను చింపడం తగదు'

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 15: మండలంలోని తల్లెంవారిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వైసీపీ వారు చింపివేయడం తగదని బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి చిన్నరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దఎత్తున అన్నదానం

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 15: మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం వద్ద గురువారం నేతలు అన్నదానం నిర్వహించారు. పేదలకు ఆకలి తీర్చడంలో ఎంతో సంతోషం ఉంటుందని వారు తెలిపారు. అన్నదానం ఒక పవిత్ర సమర్పణ అని, ఆకలితో ఉన్న పేదవాడికి ప్రతి ఒక్కరూ తమవంతు సాయంగా సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కొండయ్య, రామయ్య, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యచరణ సమితి (జేఏసీ) పిలుపు మేరకు గురువారం భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్‌యాదవ్, రాయచోటి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, జీపీఎఫ్ ఆఫ్ గిలీ, డీఏ, పీఆర్‌సీ అరియర్స్‌ను వెంటనే ఇవ్వాలని, ఓపీఎస్ అమలు చేయాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ యూటీఎఫ్ జాబీర్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి, కార్యదర్శి ఈశ్వరయ్య, ఎన్జీవో సంఘం నేతలు మహమ్మద్‌బాషా, ప్రమీలమ్మ, దేవేంద్ర, శివారెడ్డి, జయరామయ్య, మహదేవ, శ్రీనివాసులు, వరలక్ష్మి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

● ప్రిన్సిపాల్ ఎస్‌కేఎండీ అఫ్రోచ్‌బేగం



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

రామాపురం, ఫిబ్రవరి 15: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎన్‌సీసీ విద్యార్థులకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కేఎండీ అఫ్రోచ్ బేగం అవగాహన కల్పించారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్క విద్యార్థినీ, విద్యార్థులు చెట్లు నాటి వాటి పరిరక్షణ చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ చిన్నరెడ్డెప్ప, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నిలువునా మోసం : ఏబీవీపీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏబీవీపీ నేతలు, నిరుద్యోగులు, విద్యార్థులతో కలిసి కళ్లకు గంతలు కట్టుకొని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం ఎలెక్షన్ డీఎస్సీ వద్దు మెగా డీఎస్సీ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం అవమానమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ యువతకు కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, టెట్ ఫలితాలు వెంటనే విడుదల చేసి అర్హులైన వారందరికీ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రశాంత్, దేవరాజు, నాగభూషణ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి



బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యు సురేశ్‌బాబు

గాలివీడు, ఫిబ్రవరి 15: త్వరలో పరీక్షలు రాయనున్న పదవ తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఏఎస్‌డబ్ల్యు సురేశ్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నదని, ప్రతిఒక్కరూ చదువుపై ధ్యాస ఉంచి ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. మంచి మార్కులు సాధించి మీ తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని వార్డెన్లకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఖచ్చితంగా ట్యూషన్లను ఏర్పాటు చేయాలని వార్డెన్లు పర్యవేక్షించాలని కోరారు. అనంతరం వసతి గృహాల్లో అందిస్తున్న వివిధ సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు గ్యారంటీలతో యువతకు భవిష్యత్తు

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 15: బాబు గ్యారంటీలతో యువతకు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ మహిళా నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. గురువారం టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథ్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మండలంలోని సి.ఎం.రాచపల్లి, కే.వి.ఆర్.ఆర్.పురం గ్రామంలో నిర్వహించారు. టీడీపీ జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ప్రజలకు అందే సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, వెంకటయ్య, మణి, మందా నాగేశ్వరరావు, మామిళ్ల రామయ్య, మిట్టవీది మధు, నగరిపాటి సంతోష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మండల ఉపాధ్యక్షుడు మృతి

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 15: అనారోగ్యంతో మండల ఉపాధ్యక్షుడు, చింతరాచపల్లె ఎంపీటీసీ గడ్డం జనార్ధన్‌రెడ్డి (48) గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని మంటపంపల్లె గ్రామానికి చెందిన ఈయన గత కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఉండేవాడు. కాగా గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రూ.20 వేల ఆర్థిక సాయం




చెక్కును అందజేస్తున్న వికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 15: ఇటీవల పుల్లంపేట ఏపీ మోడల్ స్కూల్ వద్ద ప్రమాదంలో గాయపడ్డ కుంచం సాయిని తిరుపతి హాస్పిటల్‌లో పరామర్శించి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా టీడీపీ యువ నాయకుడు సాయి వికాస్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఆసుపత్రి ఆవరణంలో బాధితుడి తండ్రి పెంచలయ్యకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఈ సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌శేఖర్‌రెడ్డి, వెంకటరమణ, విశ్వనాథ, రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 15: పట్టణంలోని చిట్వేల్ రోడ్డు ప్రధాన రహదారిలో గల ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఎన్ఆర్ఐ బత్తల లక్ష్మయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఐదు మండలాల సంఘం అధ్యక్షులు పట్టణంలోని ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి బాణాసంచా కాల్చారు. అనంతరం వడ్డె ఓబన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా వడ్డె ఓబన్న ఆరో తరం కుటుంబీకుడు వడ్డె బాలనరసింహులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం వ్యవస్థాపకుడు కునసాల సుధాకర్, బత్తల సుబ్రహ్మణ్యం, సిద్ధేశ్వర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● సింహం దాడితో యాత్రికుల్లో పెరుగుతున్న ఆందోళన
● గతంలో మెట్ల దారిలో చిరుత... ఇపుడు పార్కులో సింహం మ్యానీటర్లుగా మారిన వైనం



ప్రహ్లాద్ గుర్జర్‌ను చంపేశాక ఎన్‌క్లోజర్‌లోకి చేరిన సింహం

సింహం దాడిలో చనిపోయిన ప్రహ్లాద్ గుర్జర్

జూలోనూ భద్రత కరువేనా?

తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుమల యాత్రికులకు నడక దారిలోనే కాదు చివరికి తిరుపతి జూపార్కులో కూడా భద్రత లేదా అన్న ప్రశ్న శ్రీవారి భక్తులోకాన్ని కలవరపరుస్తోంది. అభయారణ్యంలో చుట్టూ కంచెలు, ఆంక్షలు లేని చోట్ల చిరుతల సంచారాన్ని నియంత్రించడం అసాధ్యమని సరి పెట్టుకున్నా కట్టుదిట్టమైన ఏర్పాట్లు వుండే జూపార్కులోనూ సందర్శకులకు భద్రత లేకపోవడం అన్ని వర్గాలనూ ఆందోళనకు గురి చేస్తోంది. గురువారం మధ్యాహ్నం తిరుపతి ఎస్వీ జూపార్కులో రాజస్థాన్ సందర్శకుడు ప్రహ్లాద్ గుర్జర్ (38) నేరుగా సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడితో దుర్మరణం పాలైన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

సింహం మ్యానీటర్‌గా మారితే?

జూపార్కులోని సింహాల ఎన్‌క్లోజర్‌లో ఇప్పటి వరకూ సందర్శకులపైన, సిబ్బందిపైనా సింహాలు దాడి చేసిన ఉదంతాలు లేవు. గతంలో అభయారణ్యం నుంచీ జూపార్కులోకి ప్రవేశించిన ఓ చిరుత దాడి చేయడంతో ఉద్యోగి ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. అది మినహా చెప్పుకోదగిన ఘటనలు లేవు. తాజాఘటనలో సింహం దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో పాటు వంద నుంచీ రెండు వందల మీటర్లు లాక్కెళ్ళింది. ఆ క్రమంలో సింహం మనిషి రక్తం, మాంసాన్ని రుచి చూసింది. ఇది మ్యానీటర్‌గా మారుతుందా అన్న భయం జూపార్కు యంత్రాంగాన్ని వేధిస్తోంది. సింహం మళ్ళీ దాడులకు పాల్పడితే జూపార్కులో వైద్యులు, సిబ్బంది ప్రాణాలకు రక్షణ కల్పించడం కష్టమవుతుంది. రోజూ జూపార్కుకు సగటున 1500మంది సందర్శకులు వస్తున్నారు. వారు కొనుగోలు చేసే టికెట్లతోనూ, విరాళాలతోనూ జూ నడుస్తోంది. ఇపుడీ ఘటనతో సందర్శకుల సంఖ్య తగ్గితే మొత్తం మీద పార్కు నిర్వహణే సమస్య అవుతుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని జూపార్కు అధికార యంత్రాంగం తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకుని, సిబ్బందికి, సందర్శకులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరముంది.

సిబ్బంది లేకపోవడం కూడా...

లయన్ ఎన్‌క్లోజర్‌కు వెళ్లే మార్గంలో మొదటి గేటు పది అడుగుల ఎత్తున్నప్పటికీ సిబ్బంది కాస్త దూరంలో ఉండడంతో ప్రహ్లాద్ సులభంగానే గేటును దాటాడు. ఇనుప కంచె ఉన్న ప్రదేశంలో సిబ్బంది లేకపోయినా... గేటు ఎక్కడ ఉంటే అక్కడ ఒకరైనా సిబ్బంది ఉంటే ఇలాంటి ప్రయత్నం చేసేవారిని అడ్డుకునే అవకాశం ఉండేది.మధ్యాహ్నా భోజనం సమయం అయినందున సిబ్బందిలో ముగ్గురు నలుగురు ఒకేసారి భోజనానికి వెళ్లడం కూడా ఈ పరిస్థితికి అవకాశం ఇచ్చింది. అలా అందరూ ఒకేసారి కాకుండా వంతులవారీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిఉంది.

నడక దారి చిరుత దాడులతో బెంబేలు

తిరుపతి నుంచీ తిరుమలకు కాలినడక వెళ్ళే అలిపిరి మెట్ల మార్గంలో చిరుతలు, ఎలుగుబంట్లు, కొండ చిలువలు ఎన్నో ఏళ్ళుగా భక్తులను ఆందోళనకు గురి చేస్తూనే వున్నాయి. తరచూ మెట్ల దారిలో, మధ్య మధ్యన నడక దారిలో, అడపాదడపా ఘాట్ రోడ్డులోనూ ఇవి సంచరిస్తూ వుంటాయి. అయితే చిరుతలు భక్తులపై దాడి చేసేందుకు యత్నించడం మాత్రం 2010 నుంచీ మొదలైంది. ఆ ఏడాది జూలై 27న కోకిల అనే మూడేళ్ళ వయసున్న చిన్నారిపై అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేసింది. దాడిలో చిన్నారి గాయపడగా కుటుంబీకులు, భక్తులు కేకలు పెట్టడంతో పాపను వదిలి చిరుత పరారైంది. మరో వారానికే ఆగస్టు 2న అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పెంచలపాడు గ్రామం నుంచీ గోవిందప్ప, గీతమ్మ దంపతులు కుటుంబంతో నడచి కొండకు వెళుతుండగా వారి ఎనిమిదేళ్ళ కుమార్తె కళ్యాణిపై చిరుత పులి దాడి చేసింది. మెడను కొరికి పట్టుకుని పంజాతో భుజాలపై గాయపరిచింది. అప్పుడు కూడా తల్లిదండ్రులు, బంధువులు, ఇతర భక్తులు గావుకేకలు పెట్టడంతో చిరుత చిన్నారిని విడిచి పారిపోయింది. తర్వాత పుష్కరం పాటు చిరుతలు కనిపించడం తప్ప దాడులు చేసింది లేదు. 13 ఏళ్ళ తర్వాత గతేడాది జూన్ 22న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మూడేళ్ళ కౌశిక్‌పై చిరుత పులి దాడి చేసి మెడ పట్టుకుని అడవిలోకి లాక్కెళ్ళింది. తల్లిదండ్రులు, భక్తులు, చిరువ్యాపారులు కొంతదూరం వెంబడించినా ఫలితం లేకపోయింది. అయితే రిపీటర్ స్టేషన్ సిబ్బందికి చిన్నారి ఏడుపు వినిపించడంతో వారు హుటాహుటిన అడవిలోకి వెళ్ళి ప్రాణాలతో వున్న చిన్నారిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాలుడు బయటపడడం అందరినీ అబ్బురపరిచింది. తర్వాత గతేడాదిలోనే ఆగస్టు 12న నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం నుంచీ వచ్చిన కుటుంబంలో ఆరేళ్ళ చిన్నారి లక్షిత చిరుత దాడికి బలైంది. ఈ ఘటన భక్తులతో పాటు అన్ని వర్గాలనూ తీవ్రంగా కలచివేసింది. టీటీడీ తర్వాత అటవీ శాఖ వన్యప్రాణి విభాగంతో చర్చించి పలు చర్యలు తీసుకునేందుకు యత్నించింది. అందులో ప్రధానంగా బోన్లు ఏర్పాటు చేసి నాలుగు చిరుతలను బంధించారు. కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసి వాటి కదలికలు గుర్తించి భక్తులను నడకదారిలో అప్రమత్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాలు లేవు

జూలో గురువారం ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడం లోపంగానే చెప్పాలి.కెమెరాలు వుండి వుంటే ప్రహ్లాద్ గుర్జర్ అక్కడికి ఎపుడు వచ్చాడనే విషయం తెలిసేది. కావాలని చేశాడా లేక అనుకోని విధంగా అలా జరిగిందా అనేవిషయం తెలుసుకోడానికి వీలయ్యేది. సీసీ కెమెరాల మానిటరింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా తిరుగాడేవారిని తక్షణం గుర్తించి సిబ్బందిని అప్రమత్తంచేసి దుర్ఘటనలకు ఆస్కారం లేకుండా చూసుకోగలిగేవారు.



లయన్ ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లేందుకు ప్రహ్లాద్ గుర్జర్ ఉపయోగించుకున్న వాటర్ ట్యాంకు

ఇలా అయితే ఎలా?

పకడ్బందీ ప్రహరీ గోడ, లోపల జంతువులకు విడివిడిగా ఎన్‌క్లోజర్లు, వాటికి కాపలా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ వంటి చర్యలతో పటిష్టంగా వున్నట్టు కనిపించే జూపార్కులో భద్రత ఎంత డొల్లగా ఉందో ఈ సంఘటన వెల్లడిస్తోంది.గురువారం ఘటనలో సందర్శకుడు ఉద్దేశపూర్వకంగా సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకి వుండచ్చు. అయితే మద్యం మత్తులోనో, మతి స్థిమితం లేకనో, ఆత్మహత్య చేసుకోవాలనో ఎవరైనా జూపార్కు సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకేస్తే పరిస్థితి ఏమిటి? అడ్డుకోవడానికి వీలుగా భద్రతా వ్యవస్థ ఉందా? సందర్శకులు అత్యుత్సాహంతో ఎన్‌క్లోజర్‌లోకి దిగి జంతువులకు హాని తలపెడితే బాధ్యత ఎవరిది? సెల్ఫీల పిచ్చి పరాకాష్టకు చేరిన కాలంలో ఇటువంటివి జరిగే అవకాశాలున్నాయి. వీటిని నిరోధించేందుకు తగిన నిఘా వ్యవస్థ అవసరం అని తాజా సంఘటన చెబుతోంది.

ఒక రోజు బ్రహ్మోత్సవానికి కొండ ముస్తాబు

ఆలయం వెలుపల, లోపల పుష్పాలంకరణ







గ్యాలరీల్లోకి చేరుకున్న భక్తులు

వాహనసేవల వేళలు

- ఉదయం 5.30 - 8గంటల మధ్య: సూర్యప్రభవాహనం
- 9 - 10: చిన్నశేషవాహనం, 11 - 12: గరుడ వాహనం
- మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం
- 2 - 3: చక్రస్నానం, 4 - 5: కల్పవృక్ష వాహనం
- 6 - 7: సర్వభూపాల వాహనం,
- రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం

తిరుమల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా శుక్రవారం జరగనున్న రథసప్తమి వేడుకలకు తిరుమలలో సుందరంగా ముస్తాబైంది.శ్రీవారి ఆలయంతో పాటు పలు ప్రదేశాల్లో చేసిన పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకించి విద్యుత్ కాంతుల్లో వెంకన్న క్షేత్రం దేదీప్యమానంగా మారింది. ఆలయం లోపల 4 టన్నుల, వెలుపల 3 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరణలు చేశారు. ప్రత్యేకించి 50 వేల కట్‌ఫ్లవర్స్‌తో ఆలయంలోని పలు ప్రదేశాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. వాహనమండపాన్ని ప్రత్యేకమైన పుష్పాలు, పండ్లతో అలంకరించారు. శ్రీవారి ఉత్సవమూర్తులు ఊరేగే సూర్యప్రభ వాహనంతో పాటు మరో ఆరు ప్రధాన వాహనాలను సిద్ధం చేశారు.వాహన సేవలను వీక్షించేందుకు గురువారం సాయంత్రం నుంచే భక్తులు తిరుమల ఆలయం ముందు, మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు.రద్దీ పెరిగిన నేపథ్యంలో సీఆర్వోలో గదులు పొందడానికి భక్తులు లేపాక్షి సర్కిల్ వరకు క్యూలైన్‌లో బారులు తీరారు. గదులు లభించని భక్తులు షెడ్లు, కార్యాలయాల, ఫుట్‌పాత్‌లపై సేదదీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు చలికి ఇబ్బందిపడుతున్నారు.

కారు, కర్ణాటక మద్యం స్వాధీనం

● ఒకరి అరెస్టు... పరారీలో ముగ్గురు



మద్యం, నిందితుడిని చూపిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు, ఫిబ్రవరి 15: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న ఓ నిందితుడ్ని పోలీసులు పట్టుకోగా.. మరో ముగ్గురు పరారయ్యారు. చిత్తూరు రెండో పట్టణ సీఐ ఉలసయ్య తెలిపిన ప్రకారం.. చిత్తూరు- పలమనేరు రోడ్డులోని బాలత్రిపుర సుందరి ఆలయం వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. చిత్తూరు వైపు వస్తున్న ఓ కారును ఆపి తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా నాట్రాంపల్లెకు చెందిన జగదీష్(33)ను పట్టుకోగా, చిత్తూరుకు చెందిన పాండ్యన్, లడ్డు, తిరుపత్తూరుకు చెందిన చంద్రు కారు దిగిపారిపోయారు. పట్టుబడిన నిందితుడి నుంచి రూ.30వేల విలువ చేసే కర్ణాటక మద్యంతో పాటు రూ.4 లక్షల కారును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

నేపాల్ అమ్మాయితో పెళ్లి



పెనుమూరు, ఫిబ్రవరి 15: నేపాల్ అమ్మాయిని పెనుమూరు అబ్బాయి వివాహం చేసుకున్నారు. పెనుమూరుకు చెందిన ముకుంద నాయుడు, ధనలక్ష్మి దంపతుల రెండో కుమారుడు భువన్‌కృష్ణ లండన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అదే కంపెనీలోనే పనిచేసే నేపాల్‌కు చెందిన జి. మనీలతో ఇతడి పరిచయం ప్రేమకు దారితీసింది. నాలుగేళ్ల వీరి ప్రేమను ఇద్దరి ఇళ్లలో చెప్పారు. దీంతో గురువారం చిత్తూరులోని ఓ హోటల్లో కుటుంబ సభ్యులు వీరికి పెళ్లి చేశారు.

సినీ ఫక్కీలో నగదు చోరీ

పుంగనూరురూరల్, ఫిబ్రవరి 15: పుంగనూరులో దుకాణం వద్ద నిలబడి ఉన్న ఓ వ్యక్తిని ఓ దుండగుడు ఏమార్చి అతడి వద్ద ఉన్న నగదు దోచుకెళ్లాడు. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.... మండలంలోని చంద్రమాకులపల్లెకు చెందిన రామన్న కుమారుడు వెంకటరమణ బ్యాంకులో రూ.74వేలు డ్రా చేసి బ్యాగ్‌లో పెట్టుకుని ఆర్టీసీ బస్టాండ్ క్రాస్‌లోని ఓ దుకాణం వద్ద నిలబడ్డాడు. ఓ గుర్తుతెలియని వ్యక్తి వెంకటరమణ షర్టు వెనక భాగంలో మరక ఉన్నట్లు చెప్పడంతో అతను చేతిలో ఉన్న బ్యాగ్‌ను దుకాణం వద్ద పెట్టి షర్టు తీసి పరిశీలిస్తుండగా దుండగుడు బ్యాగ్‌తో పరారీ అయ్యాడు. పక్కన ఉన్న వ్యక్తులు బ్యాగ్ తీసుకెళుతున్నట్లు వెంకటరమణను చెబుతుండగానే అప్పటికే ఆ వ్యక్తి పరుగులు తీయడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 15: ఎస్ఆర్‌పురం సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ శశికుమార్‌పై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన ప్రకారం.. ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం గ్రామానికి చెందిన చిన్నబ్బకు గతంలో జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ఈ నెల 12వ తేది సాయంత్రం జగనన్న ఇంటి బిల్లు విషయమై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను అడగ్గా, ఆగస్టు నెలలోనే ఎంబుక్ రికార్డు చేసి ఉన్నామని, బిల్లు త్వరలో పడుతుందని చెప్పారు. దీంతో చిన్నబ్బ ఆవేశంతో తనను దుర్భాషలాడాడని, కంప్యూటర్‌తో ప్రింట్ కూడా తీసిస్తానని చెప్పినా వినలేదన్నారు. చిన్నబ్బ తన బావమరిది, పాతపాళ్యం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిచ్చయ్యతో కలసి తనపై దాడి చేశారని వాపోయారు. ఆ రోజే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి

శాంతిపురం, ఫిబ్రవరి15: కనమలదొడ్డి-శ్యామరాజుపురం రహదారిలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి చెందింది. శ్యామరాజుపురం గ్రామానికి చెందిన మునియప్ప కుమార్తె రేణుక (6) అవ్వతాతతో కలిసి పొలం వద్దకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రేణుక తీవ్రంగా గాయపడింది. గాయపడిన బాలికను కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రేణుక మృతి చెందింది. రాళ్లబుదుగురు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడేళ్ల కిందట ఐపీ

● పెనుమూరు వ్యాపారిని పట్టుకొచ్చి నిలదీసిన బాధితులు



ప్రవీణ్‌ను ఉంచిన ఇంటి వద్ద బాధితులు

పెనుమూరు, ఫిబ్రవరి 15: పెనుమూరుకు చెందిన వస్త్ర వ్యాపారి పాండురంగయ్యశెట్టి, అతడి మనవడు ప్రవీణ్ 2021లో రూ.85 కోట్లకు ఐపీ పెట్టారు. ఆ తర్వాత కనిపించకుండా వెళ్లిన విషయం అప్పట్లో కలకలంరేపింది. బాధితులూ ఆవేదన చెందారు. ఈ క్రమంలో గురువారం ప్రవీణ్ తిరుపతిలో ఉన్న విషయం తెలిసి కొందరు బాధతులు వెళ్లి పెనుమూరుకు తీసుకొచ్చారు. అదే సమయంలో మిగతా వందలాది బాధితులూ అక్కడకు చేరుకున్నారు. ప్రవీణ్‌ను నిలదీశారు. తాను వ్యాపారంలో నష్టపోయానని, మరొకరికి డబ్బులిచ్చి మోసపోవడంతో ఐపీ పెట్టాల్సి వచ్చిందని ప్రవీణ్ చెప్పారు. బెంగళూరు, పెనుమూరులో ఉన్న ఆస్తులను అమ్మి ఇచ్చేస్తామని, తమను క్షమించాలని కోరారు.

తిరుచానూరు ఆలయం వద్ద భక్తురాలిపై దాడి

తిరుచానూరు, ఫిబ్రవరి 15: శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి దర్శనానికి విచ్చేసిన ఓ భక్తురాలిపై ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది దాడిచేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన ఓ భక్త బృందం గురువారం ఉదయం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది.ఆ సమయంలో తిరుప్పావడ సేవ జరుగుతుండడంతో ఆలయంలోకి సాధారణ భక్తులను అనుమతించలేదు. సేవ ముగిసే సమయానికి ఒక్కసారిగా భక్తులు క్యూలైన్ వద్దకు దూసుకువచ్చారు. ఆలయం గేట్ నంబరు 4 వద్ద సేలం భక్త బృందం దూసుకుని క్యూలైన్‌వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది సురేష్, వారి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన సురేష్ ఆ భక్తబృందంలోని ఓ మహిళ తలపై మ్యాన్‌ట్యాక్‌తో కొట్టడంతో ఆమెకు గాయమైంది. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. భక్త బృందానికి సర్దిచెప్పి అమ్మవారి దర్శనం చేయించి పంపారు. దీనిపై ఆలయ విజిలెన్సు అధికారి రామమోహన్‌ను అడగ్గా ఆ భక్తురాలు తోపులాటలో క్యూలైన్లో కమ్మిపై పడి గాయపడిందని చెప్పారు.అంతే కానీ తమ సిబ్బంది దాడి చేయలేదన్నారు.ఇక్కడ పనిచేసే ఆర్జితం ఇన్‌స్పెక్టర్ గతంలో మ్యాన్‌ట్యాక్‌తో ఓ కానిస్టేబుల్‌పై దాడి చేయగా కేసు నమోదై అరెస్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే.

మద్యం విక్రేత అరెస్టు

కలికిరి, ఫిబ్రవరి 15: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని కలికిరి పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మోహన్ తెలిపిన వివరాల ప్రకారం కలికిరి పట్టణ శివారులోని నగరిపల్లె క్రాస్ వద్ద చిన్నరామన్నగారి సతీష్‌రెడ్డి మద్యం అమ్ముతున్నాడనే సమాచారంతో ఇన్‌స్పెక్టర్ మోహన్ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించి అతని వద్ద నుంచి రూ. 3,300లు విలువ చేసే 21 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సెలబ్రిటీస్ చాయిస్ బ్రాందీ 10, కింగ్స్ వెల్ బ్రాందీ 6, మాన్షన్ హౌస్ బ్రాందీ 5 బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గుర్రంకొండ, ఫిబ్రవరి 15:అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన శ్రీనివాసులు(55) మద్యం తరలిస్తుండగా ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేసి మండలంలోని చెర్లోపల్లె సమీపంలోని కోన క్రాస్ వద్ద పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 20 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

కిడ్నీ బాధితుడి కుటుంబానికి జనసేన నేతల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కలప రవి, తదితరులు

పీలేరు, ఫిబ్రవరి 15: పీలేరు మండలం చెరువుముందరపల్లెకు చెందిన కిడ్నీ బాధితుడు హరి కుటుంబానికి జనసేన నాయకులు గురువారం నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి కలప రవి మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి బారినపడి ఇబ్బంది పడుతున్న హరి కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మోహనకృష్ణ, గజేంద్ర, గురుమోహన్, నవీన్, హరీశ్, అండే సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిపై గ్రామాల్లో అవగాహన



మల్లెల గ్రామంలో మహిళలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 15 : మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఎయిడ్స్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించినట్లు కృషి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మల్లెల పంచాయతీలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో కృషి సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ. టీబీ ఇతర సుఖవ్యాధులపై మల్లెల గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు హెచ్ఐవీ, టీబీ వ్యాధులు ఎలా సంక్రమిస్తాయి, వ్యాధి లక్షణాలు నివారణ మార్గాల గురించి వివరించారు. అనంతరం మహిళలకు కాన్సర్, స్క్రీనింగ్ పైన అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో కృషి సంస్థ ఏఎన్ఎం చంద్రనాగమ్మ, ఓఆర్.డబ్ల్యూ భారతి, పీఈలు ఉమాదేవి, మంజులతో పాటు సంఘమిత్ర మంజుల, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న పోలీసులకు సన్మానం



బదిలీ అయిన వారిని సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ మోహన్

కలికిరి, ఫిబ్రవరి 15: కలికిరి పోలీసు స్టేషన్ నుంచి అర్ధాంతరంగా బదిలీపై వెళుతున్న పోలీసులకు గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ పోలీసు స్టేషన్ నుంచి నలుగురిని అర్థాంతరంగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. అందులో పెద్దమండ్యం స్టేషన్‌కు బదిలీ అయిన ఏఎస్ఐ మధుసూదనాచారి, రామసముద్రంకు బదిలీ అయిన హెచ్‌సీ మనోహర్‌లను ఇన్‌స్పెక్టర్ మోహన్ శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహబూబ్ సాహెబ్, హెచ్‌సీలు మహ్మద్ ఆలీ, రాజేంద్రప్రసాద్, సిబ్బంది రఫీ, అమర, మధు, జిలాని, కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ

బి.కొత్తకోట,ఫిబ్రవరి15:బి.కొత్తకోట నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో పీటీయం, బి.కొత్తకోట మండలాలలకు చెందిన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను తంబళ్లపల్లె ఎమెల్యే ద్వారకనాథరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నగరపంచాయతీ కమిషనర్ పీఆర్ మనోహర్, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జడ్పీటీసీ రామచంద్ర, మాజీ ఎంపీపీ ఖలీల్‌అహ్మద్, ఎంపీడీవో నూర్జహాన్ తోపాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి పంపిణీ



ములకలచెరువు, ఫిబ్రవరి 15: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ తోట శ్రీధర్ నగదు బహుమతిని అందజేశారు. స్థానిక పాఠశాలలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తల్లితండ్రులు లక్ష్మీదేవమ్మ, దామోదరంల జ్ఞాపకార్థం చదువులో రాణిస్తున్న విద్యార్థులకు రూ.10వేలు నగదును పంపిణీ చేశారు. అలాగే పాఠశాలకు రూ.20వేలు విలువ చేసే ప్రింటర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ జయరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



శ్రీవారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న టీటీడీ వేదపండితులు, అర్చకులు

సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు



తంబళ్లపల్లె, ఫిబ్రవరి 15: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం కమనీయంగా సాగింది. టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో బాగంగా వేకువజామునే స్వామి వారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటరమణ స్వామి వారు సర్వభూపాల వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వేదపండితులు ఆలయ వాహన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవర్లను అదిష్టింప చేసి మంగళవాయిద్యాల నడుమ శ్రీనివాసుడి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు అశేష సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారి కల్యాణాన్ని కళ్లారా తిలకించి తరించారు. భక్తజనం గోవింద నామస్మరణలతో ఆలయ ఆవరణం మార్మోగింది. అనంతరం శ్రీనివాసుడు తన ప్రియ వాహనమైన గరుడ వాహనంపై ఆశీనులై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ సిబ్బంది భక్తులకు టీటీడీ లడ్డూలను పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం రథోత్సవం, రాత్రి 8 నుంచి గజవాహనసేవ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసమంగాపురం టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, ఉప ప్రధాన అర్చకుడు కృష్ణ ప్రసాద్ భట్టర్, అర్చకులు రమేష్ పాల్గొన్నారు.

మద్య నిషేధంపై మాటమార్చిన జగన్

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దినేశ్



కేవీపల్లెలో నాసిరకం మద్యం బాటిళ్లను చూపుతున్న జనసేన, టీడీపీ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 15: మద్యనిషేధంపై మాటమార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే నైతిక హక్కు కోల్పోయారని పీలేరు నియోజవర్గ జనసేన ఇన్‌చార్జి బెజవాడ దినేశ్ ఆరోపించారు. మద్యపాన నిషేధంలో జగన్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా జనసైనికులతో కలిసి ఆయన గురువారం కేవీపల్లెలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ మద్యనిషేధం చేసిన తరువాతనే ప్రజల ముందుకు ఓటు కోసం వస్తానని 2019 ఎన్నికల్లో జగన్ ప్రకటించారని దినేశ్ గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మద్యనిషేధం చేపట్టకుండా రానున్న పాతికేళ్ల పాటు మద్యంపై వచ్చే ఆదాయాన్ని చూపించి అప్పులు తెచ్చుకుని సంపూర్ణ మద్యనిషేధానికి తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. మద్యనిషేధం చేయనందు వల్ల ఆయన త్వరలో జరగనున్న ఎన్నికల నుంచి తప్పుకోవాలని దినేశ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మహేశ్, రెడ్డప్ప, అస్లం, ప్రభాకర్, పవన్, గౌస్‌బాషా, కిశోర్, చిరంజీవి, అశోక్, గురుమూర్తి, రమణ, సాయికుమార్, నవీన్, విశ్వనాథ్, బావాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



ఊరేగింపు నిర్వహిస్తున్న ఏపీ గిరిజన సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 15: బంజారీల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని మదనపల్లె పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటంతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నక్కలదిన్నెలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ నాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతి రోజు ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని, నియోజకవర్గంలో బంజార కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ఇప్పటికీ బంజారులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ చొరవ చూపి బంజారులకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో హరికృష్ణ, ఈశ్వర్‌నాయక్, శంకర్నాయక్, అమరేంద్రనాయక్ తోపాటు అధిక సంఖ్యలో బంజారులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు వేదతేజ

పీలేరు, ఫిబ్రవరి 15: పీలేరు మండల తెలుగు యువత అధ్యక్షుడు దళవాయి సురేశ్‌కుమార్‌రెడ్డి(కంచి సూరి) గురువారం ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో కాలనీకి చెందిన 200 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారు. తిరుపతికి చెందిన రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన యూరాలజీ, జనరల్ వైద్యులు వేద తేజ, ప్రీతి, లోకేశ్వరి, జ్యోతి ప్రజలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపల్లె బాబు రెడ్డి, లక్ష్మీకర, స్పోర్ట్స్ మల్లి, అగ్రహారం వెంకటరమణారెడ్డి, స్వరూప్ కుమార్, కొవ్వూరి హరి, షామియాన జయన్న, భాస్కర, శ్రీను, పద్మావతి, సురేంద్ర, మురళీమోహన్, ప్రభాకర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాడి ఆవుల పట్ల జాగ్రత్తలు పాటించాలి



పాడి ఆవుకు వైద్యం చేస్తున్న జోనల్ చైర్మన్ మహేష్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 15: పాడి ఆవుల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచించారు. మండలంలోని అగ్రహారం పంచాయతి చెరువుముందరపల్లిలో గురువారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కరాచారి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జోనల్ చైర్మన్ మహేష్, రిటైర్డ్ ఏడీ హసన్‌సాబ్, భాస్కరాచారిలు అనారోగ్య కారణాలతో ఉన్న పశువులకు వైద్యం అందించారు. ప్రతి పాడి రైతు తప్పని సరిగా ఆవులకు ఇన్సూరెన్స్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది మునీంద్ర, రెడ్డెప్ప, మల్లికార్జున, హరి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

కలకడ, ఫిబ్రవరి 15:రాష్ట్ర భవిష్యత్‌కు ఉపయోగపడేలా కొత్త ఓటు హక్కు పొందిన యువత ఓటును ఆయుధంగా వినియోగించుకోవాలని తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎస్వీ డిగ్రీ కాలేజీలో 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అబ్బూరి చంద్రబాబు మాట్లాడుతూ 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబునాయుడు హయాంలో యువతకు వివిధ రంగాలలో ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల దృష్టిలో బాధ్యతా యుతంగా ఆలోచించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం శివప్రసాద్, ముబారక్, ఎన్టీఆర్ నసీఫ్, నాగేశ్వరరావు, బాలసుబ్రమణ్యం, జిలానీ, క్రాంతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకులకు దరఖాస్తుల అహ్వానం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 15: వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ విభాగంలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఎకనామిక్స్ సబ్జెక్టులో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. అదేవిధంగా పీహెచ్‌డీయుజీసీ నెట్/ ఏపీసెట్ కలిగినటువంటి అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, అసక్తిగల అభ్యర్థులు ఈనెల 17వ తేదీలోపు తమ బయోడేటాతో పాటు నేరుగా కళాశాలకు హాజరు కావాలని తెలియజేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి..

బి.కొత్తకోట, ఫిబ్రవరి15: బి. కొత్తకోట మండల పరిధిలోని చంద్రమాకులపల్లె వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంగ్లీష మీడియం, ఇంటర్ ఫస్టియర్ (సీఈసీ,హెచ్ఈసీ) లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ శ్రీరామ కోటేశ్వరరావు తెలిపారు. గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. అదేవిధంగా ఇంటర్‌లో ప్రవేశానికి ఈ ఏడాది 10తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. కళాశాలలో ప్రవేశానికి అన్నమయ్య, కడప జిల్లా లలో నివాసం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులకు ప్రవేశపరీక్ష మార్చినెల 10వ తేదీన జరుగుతుందన్నారు. తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని, పరీక్షలో వారు సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.. ఆన్‌లైన్ లో దరఖాస్తుకు ఈ నెల 23 వరకు గడవు ఉందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాల పనివేళలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో శ్రీరాం పురుషోత్తం

మదనపల్లె అర్బన్/నిమ్మనపల్లి, ఫిబ్రవరి 15: పది పరీక్షల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితా లు సాధించాలని డీవైఈవో శ్రీరాం పురుషోత్తం పేర్కొన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థి నులకు అందుతున్న సౌకర్యాలు, నాణ్యమైన భోజనంపై ఆరాతీశారు. .కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ పాల్గొన్నారు. మదనపల్లె మాయాబజార్‌లోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను డీవైఈవో సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో పలు అంశాలకు సంబంధించిన ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలపై అవగాహన అవసరం



విజేతలతో ఉపాధ్యాయులు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 15: విద్యార్థి దశ నుంచే నాణ్యతా ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అంజాద్ అలీఖాన్ పేర్కొన్నారు. గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో స్టాండర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఇందులో మొదటి బహుమతి షైతిలీ రూ.వెయ్యి, ద్వితీయ బహుమతిగా హర్షిత రూ.750, తృతీయ బహుమ తి కింద శ్రావ్య రూ.500లను గెలుచుకొన్నారు. క్లబ్ మెంటర్ రాజేంద్ర, హెచ్‌ఎం బహుమతులను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ కంటి ఆస్పత్రికి ల్యాప్‌టాప్ విరాళం



ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న ఎన్ఆర్ఐ దంపతులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 15: మదనపల్లె పట్టణం పీఅండ్‌టీ కాలనిలోని లయన్స్ కంటి ఆస్పత్రికి ఎన్ఆర్ఐ దంపతులు రూ.65వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను విరాళంగా అంద జేశారు. గురువారం లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ తమ కుమారుడు బోడెపాటి అజయ్‌కుమార్, మీనాకుమారి దంపతులు లయన్స్ కంటి ఆస్పత్రికి ల్యాప్‌టాప్‌ను విరాళంగా అందించారన్నారు. పేదలకు ఉచితంగా కంటి పరీక్ష లు, శస్త్ర చికిత్సలు చేస్తూ లయన్స్ కంటి ఆస్పత్రి సేవలందిస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో లయన్ గౌతమ్‌రెడ్డి, మహేష్, భాస్కరాచారి పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం



టీడీపీ, జనసేన నేతలు కిశోర్‌కుమార్‌రెడ్డి, రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, ఫిబ్రవరి 15: సాధారణ ఎన్నికల్లో టీడీపీ-జనసేన గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని ఇరుపార్టీల ముఖ్యనేతలు నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, గంగారపు రామ్‌దాస్‌చౌదరిలు పేర్కొన్నారు. అధిష్ఠానం తీసుకున్న పొత్తుధర్మాన్ని ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. మండలంలోని కొత్తపల్లెలో టీడీపీ నేత, టౌన్ బ్యాంకు మాజీచైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ నివాసంలో ఇరుపార్టీల నేతలు సమావేశమయ్యారు. ఇందులోభాగంగా టీడీపీ నేత కిశోర్‌కుమార్‌రెడ్డి, జనసేన రామ్‌దాస్‌చౌదరి ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. పొత్తులో భాగంగా టికెట్ ఎవరికి వచ్చినా..అందరూ కలసిమెలసి పనిచేయాలని వారు, కార్యకర్తలకు సూచించారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా పనిచేయాలన్న అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలనే విషయాన్ని మనమంతా గుర్తించుకోవాల్సిన అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీనేతలు రాటకొండ మధుబాబు, యాలగిరి దొరస్వామినాయుడు, నవీన్‌చౌదరి, సుధాకర్‌నాయుడు, బాలుస్వామి, జనసేన రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బాబు, రూరల్ ప్రధాన కార్యదర్శి పవన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో రైతన్నల ఇక్కట్లు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 15: కరెంటంటు కోతలతో రైతన్నలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేశ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అగ్రహారం పంచాయతీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో తప్పుడు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేక పోయారని విమర్శించారు. అంతే కాకుండా మద్యపాన నిషేధం నినాదంతో అధికారంలోకి వచ్చిన జగన్‌కు మద్యమే ఆదాయంగా మార్చుకుని జనాన్ని మోసగించారని ధ్వజమెత్తారు. జగన్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు టీడీపీ సీనియర్ నేత చెక్కర వెంకటరమణ అనారోగ్యకారణాలతో మరణిండంతో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు కార్యక్రమంలో టీడీపీ నేతలు రెడ్డెప్పరెడ్డి, మునిరత్నం, ఆరే వెంకటేష్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుంది

● జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు



ప్రచారం నిర్వహిస్తున్న జనసేన నేత రామాంజనేయులు, అనిత

మదనపల్లె, ఫిబ్రవరి 15: పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. ఫలితం ఆశించకుండా పనిచేసేవారికే ఫలితం దానంతట అదే వస్తుందని జనసైనికులకు సూచించారు. జనంకోసం జనసేన కార్యక్రమంలో భాగంగా గురువారం 60వరోజు సీటీఎంరోడ్డు, ఎస్టేట్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వ హించారు. జనసేన సిద్ధాంతాలు, అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవడంతోపాటు రెండునెలల్లో ఏర్పడబోయే జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభు త్వంలో తాము చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల రూపంలో వివరిం చారు. అన్నిరంగాల్లో వైఫలం చెందిన, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని రెండునెలల్లో గద్దెదింపి, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా కీలకమైన ఈకొన్నిరోజులు కష్టపడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాసేన నావంతు రాష్ట్రకమిటీ సభ్యురాలు దారం అనిత, దారం హరిప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, కొణిదెల శంకర్‌బాబు, కోటకొండ చంద్రశేఖర్, కుప్పాల శంకర్, అశ్వత్, ధరణికుమార్, సోను, గణేష్, సిద్ధు, రమేష్, సుప్రీంహర్ష, యాసిన్, నవాజ్, బహదూర్, చంద్రశేఖర్, పద్మావతి, శేఖర్ పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించండి

● దారి సమస్యను పరిశీలించిన తహశీల్దార్



దారి సమస్యను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనాథ్

గుర్రంకొండ, ఫిబ్రవరి 15:రైతులు పొలాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు. ఓ మోతుబరి రైతు దారిని అక్రమించు కొని ఫెన్సింగ్ వేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నామంటూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తహశీల్దార్ శ్రీనాథ్ గురువారం గ్రామానికి వెళ్లి దారి ఆక్రమణలను పరిశీలించారు. మండలంలోని గుర్రంకొండ పంచాయితీ పరిధిలోని మజ్జిగవారిపల్లె క్రాస్ నుంచి మర్రిమాకులపల్లె వరకు పూర్వం నుంచి బండి బాట ఉంది. ఈ మార్గం గుండా సుమారు 50 మంది రైతులు తమ పొలాల వద్దకు వెళుతున్నారు. ఈ క్రమంలో ఓ మోతుబరి రైతు పొలాలకు వెళ్లే దారిని అక్రమించుకొని రాతి కూసాలను నాటారు. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి దారి లేక తీవ్రయిబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రైతులందరూ కలిసి మరోమారు బుధవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన రైతు ఆక్రమించిన దారిని పరిశీలించారు. అనంతరం రెవెన్యూ రికార్డులను పరిశీలించి గ్రామ పటంలో బండి బాట ఉన్నట్లు వీఆర్వో, సర్వేయర్లు తహశీల్దార్ దృష్టికీ తీసుకొచ్చారు. రికార్డులను పరిశీలించి రైతులకు దారిని ఏర్పాటు చేయిస్తామని ఆయన తెలిపారు.

చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరండి



'చలో విజయవాడ' వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 15: సీపీఎస్ రద్దు కోరుతూ ఈ నెల 18న తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ కోరారు. గురువారం 'చలో విజయవాడ' కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆయన పీలేరులోని జడ్పీ మెయిన్ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని గత ప్రభుత్వంలో ఉద్యమాలు చేస్తే చంద్రబాబు నాయుడు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ అమలు చేశారన్నారు. వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తానని ఉద్యోగుల ఓట్లు దండుకున్న జగన్మోహన్ రెడ్డి మాత్రం దాని గురించి పట్టించుకోలేదన్నారు. ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని, పైపెచ్చు జీపీఎస్ పేరుతో ఉద్యోగులకు తీవ్రంగా నష్టం చేకూర్చే గోల్‌మాల్ పెన్షన్ తీసుకువచ్చారన్నారు. ఆ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ 'ఓట్ ఫర్ ఓపీఎస్' పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికిసీపీఎస్ ఉద్యోగులందరూ విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయులు పోతంశెట్టి రమేశ్, కిశోర్ కుమార్, ఫారుఖ్ ఖాన్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 15: మదనపల్లె సమీపంలోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్(జీఎంఆర్)పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు వచ్చినట్లు ప్రిన్సిపాల్ కె.ఓబులేశు తెలిపారు. కళాశాలలోని ఆధునిక ల్యాబ్‌లు, అర్హత గల అధ్యాపకులు, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విద్యార్థులకు ఉద్యోగాలు తదితర అంశాలను గుర్తించిన ఎన్‌బీఏ నుంచి కళాశాలకు గుర్తింపు వచ్చిందన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి 2027 వరక కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు 2024 పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి తమ కళాశాలలో చేరే అవకాశం ఉందన్నారు. ఎన్‌బీఏ గుర్తింపు పొందడానికి కృషి చేసిన అధ్యాపకులు ఆర్.సావిత్రి, ఎ.మురళి, బోధనేతర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుర్రంకొండ తహసీల్దార్‌గా శ్రీనాథ్

గుర్రంకొండ, ఫిబ్రవరి 15:గుర్రంకొండ తహసీల్దార్‌గా శ్రీనాథ్ గురువారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఖాజాబీ బదిలీపై సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో కర్నూల్ జిల్లాలో పని చేస్తున్న శ్రీనాథ్‌ను గుర్రంకొండ తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం ఆయన బాధ్యతలను స్వీకరించారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 15: మదనపల్లె కోర్టులో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రెండవ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎన్.శాంతి ఒక ప్రకటనలో కోరారు. ప్రమాద కేసులు, సివిల్ కేసులు ఇతర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని జడ్జి తెలిపారు.